## సన్న బియ్యం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): సన్న బియ్యం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భద్రాచలం ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. సన్నబియ్యం పంపిణీ పథకాన్ని కలెక్టర్లు తమ జిల్లాల్లోని అన్ని మండలాల్లో ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా రేషన్ షాపులకు సన్న బియ్యం తరలించామన్నారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, పౌర సరఫరాల శాఖ అధికారి రుక్మిణి, మేనేజర్ త్రినాథ్‌బాబు పాల్గొన్నారు.

## నలుగురు మావోయిస్టుల లొంగుబాటు

### వివరాలు వెల్లడించిన సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్


లొంగిపోయిన మావోయిస్టులకు ప్రోత్సాహక చెక్కు అందజేస్తున్న సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్, సీఆర్‌పీఎఫ్ అధికారులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 4 : పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)కి చెందిన నలుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయారు. వివరాలను సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్టు పార్టీకి చెందిన పీఎల్‌జీఏ ఒకటో బెటాలియన్-పశ్చిమ బస్తర్ డివిజన్‌కి చెందిన మావోయిస్టులు తమ పార్టీ సిద్ధాంతాలపై అసంతృప్తితో పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ బర్సే దేవా సోదరుడు బర్సే సన్నతో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'నియద్ నెల్లా నార్' కార్యక్రమానికి ఆకర్షితులై మావోయిస్టులు లొంగిపోతున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఇద్దరిపై రూ.8 లక్షల చొప్పున రివార్డు, మరో మావోయిస్టుపై రూ.2 లక్షలు, మహిళా మావోయిస్టుపై రూ.2 లక్షలు.. మొత్తం రూ.20 లక్షల రివార్డులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీవో

బూర్గంపహాడ్, ఏప్రిల్ 4: భద్రాచలంలో రేపు జరుగనున్న శ్రీరామనవమిని పురస్కరించుకుని పారిశ్రామిక వాడ సారపాకలో పంచాయతీ ఈవో కంది మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సారపాక-భద్రాచలం గోదావరి బ్రిడ్జి వద్ద రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసిన మొక్కలను శుభ్రం చేయించడంతో పాటు చుట్టుపక్కల చెత్తాచెదారం లేకుండా పంచాయతీ సిబ్బందిచే తొలగించారు. ఈ పనులను డీఎల్‌పీవో సుధీర్ ఈవో మహేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇల్లెందుపై నిఘా నేత్రాలు


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు, ఏప్రిల్ 4: ఇల్లెందు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో 32 సీసీ కెమెరాలను స్థానిక కూరగాయల మార్కెట్ వ్యాపారుల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేశారు. వీటిని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను తన కార్యాలయం నుంచి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉందని అన్నారు. ఈ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించిన పట్టణ కూరగాయల మార్కెట్ వ్యాపారులను అభినందించారు. ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ, గుండాల సీఐ ఎల్.రవీందర్, ఇల్లెందు ఎస్సైలు బి.సూర్య, సందీప్‌కుమార్, నాగుల్ మీరా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే పాయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 4: ప్రభుత్వ దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు వంద పడకల ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో శుక్రవారం ఎమ్మెల్యే సమీక్షించారు. వందపడకల ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే వారందరికీ ఆదరించి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. వేసవిలో వడదెబ్బ ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, నాయకులు పిరినకి నవీన్, తరుణ్‌రెడ్డి, సౌజన్య, సైదులు, సతీష్, బాబు పాల్గొన్నారు.

**సీతారాముల కల్యాణానికి రావాలని ఆహ్వానం**

బూర్గంపహాడ్, ఏప్రిల్ 4: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలోని రామాలయంలో శ్రీరామనవమికి హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు.

## విద్యార్థుల 'పద్య గళార్చన'

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 4: స్థానిక శ్రీ గౌతమీ స్కూల్‌లో విద్యార్థులు శుక్రవారం 'పద్య గళార్చన' నిర్వహించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విరచిత కాళికాంబ సప్తశతిలోని 701 పద్యాలను వంద నిమిషాలలో ఆలపించి అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ కొఠారు చలపతిరావు అధ్యక్షతను జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు, ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# రామయ్య కల్యాణం దేశానికే తలమానికం

**భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు**
**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలం, ఏప్రిల్ 4: భద్రాచలం రామయ్య కల్యాణం దేశానికే తలమానికమని.. అలాంటి రాముడి కల్యాణానికి రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి చైర్మన్ పొదెం వీరయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. శ్రీరామనవమి, పట్టాభిషేకం మహోత్సవాలకు సంబంధించి 48 గంటలు మాత్రమే సమయం ఉండడంతో ఎవరికి అప్పగించిన బాధ్యతలు వారంతా మనస్సు పెట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, ఇప్పటికే అందుకు అనుగుణంగా కలెక్టర్ పర్యవేక్షణలో ఏర్పాట్లు జరిగాయని తెలిపారు. అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో దామోదరరావు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**కరకట్ట పనులు ఎందుకు ఆపారు..**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముందుగా కరకట్ట ప్రాంతాన్ని పరిశీలించి పనులను పర్యవేక్షించారు. కరకట్ట పనులు నిలిపివేయడంతో పాటు పనుల పురోగతిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారితో ఫోన్లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఏరియా ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలి**

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్వహణ సరిగా లేదనే విమర్శలు వస్తున్నాయని మంత్రి తుమ్మల వైద్యుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణను ఆసుపత్రి విషయమై ప్రశ్నించగా కొత్తగా వైద్యులు వచ్చారని, వారికి అవగాహన లేనికారణంగా కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని అవి మళ్లీ జరుగకుండా చూస్తున్నామని వివరించారు.

# గ్యారెంటీలు, సమస్యలపై అధ్యయన యాత్ర


మాట్లాడుతున్న ఏజే రమేష్

ఇల్లెందు, ఏప్రిల్ 4: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతోపాటు స్థానిక సమస్యలపై అధ్యయనానికి యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ చెప్పారు. ఇల్లెందులోని ఏలూరి భవనంలో పార్టీ పట్టణ, మండల స్థాయి వర్క్‌షాప్ శుక్రవారం తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఏజే రమేష్ మాట్లాడుతూ.. పార్టీ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ఆరు గ్యారెంటీలతోపాటు సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యలపై అధ్యయన యాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. దీనిని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇల్లెందు మండలంలోని అన్ని గ్రామాల్లో వార్డులవారీగా అధ్యయన యాత్ర నిర్వహించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్వే నిర్వహించాలని, ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను సేకరించాలని చెప్పారు. ఈ అధ్యయన నివేదికల ఆధారంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్ రావు, సుల్తాన, వెంకటేశ్వర్లు, సంధ్య, సర్వన్, వెంకటమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట, ఏప్రిల్ 4: ప్రజల సమస్యలపై సీపీఎం చేపట్టే అధ్యయన యాత్ర(సర్వే)లో కార్యకర్తలంతా పాల్గొనాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య కోరారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సర్వే ఆధారంగా ఉద్యమ కార్యాచరణ ఉంటుందన్నారు. నాయకులు బుడితి చిరంజీవి నాయుడు, సోడెం ప్రసాద్, ముళ్ళగిరి గంగరాజు, తగరం నిర్మల, మడిపల్లి వెంకటేశ్వరరావు, కారం సూరిబాబు పాల్గొన్నారు.

ములకలపల్లి, ఏప్రిల్ 4: పల్లెల్లోని సమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి అధ్యయన యాత్ర(సర్వే) సాగించాలన్నారు. నాయకులు ముదిగొండ రాంబాబు, పొడియం వెంకటేశ్వర్లు, ఊకంటి రవికుమార్, గౌరీ నాగేశ్వరరావు, మాలోత్ రావూజా, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

## కనెక్షన్లు ఫుల్.. నీళ్లు నిల్


వాటర్ ట్యాంక్

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని అశోక్‌నగర్ పంచాయతీలో ఇంటింటికీ మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్లు ఉన్నాయి. కానీ ఏం లాభం..? నీళ్లు మాత్రం రావడం లేదు. ఇది అసలే ఎండాకాలం. రోజూ నీళ్లివ్వాలి. కానీ, ఇక్కడ మాత్రం వారంలో ఒకటీ రెండుసార్లు మాత్రమే నీళ్లు వదులుతున్నారు. ట్యాంక్ శుభ్రంగా లేకపోవడమో.. మరేదైనా కారణమో తెలియదుగానీ ఆ నీళ్ల నుంచి దుర్వాసన వస్తున్నది. ''మా అశోక్‌నగర్ పంచాయతీలోని కొందరికి మాత్రం నీళ్లు పుష్కలంగా వస్తున్నాయి. తండా వాసులకు మాత్రం వారంలో ఒకటి రెండుసార్లు మాత్రమే వస్తున్నాయి'' అని, ఆ తండా వాసులు ఆరోపిస్తున్నారు. తమకు దుర్వాసనతో కూడిన నీళ్లు కాకుండా స్వచ్ఛమైన తాగునీటిని రోజూ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆటో బోల్తా పడి వ్యక్తికి గాయాలు

అశ్వాపురం, ఏప్రిల్ 4: ఆటో బోల్తా పడి వ్యక్తి గాయపడిన ఘటన శుక్రవారం బీజీ కొత్తూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొండికుంట వైపు నుంచి అశ్వాపురం వైపు వెళ్తున్న టీఎస్ 28టీ 3816(ఆటో) ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం గ్రామానికి చెందిన కణితి శివ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్సై రవూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ అంతరాయం

అశ్వారావుపేట, ఏప్రిల్ 4: మండలంలోని వినాయకపురం 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా వినాయకపురం, నారాయణపురం సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిస్కం ఏఈ సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.00 నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేత

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని గట్టుమల్ల పంచాయతీ గంగమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి 30 కుర్చీలను టీం సంభవ ఫౌండేషన్ (హైదరాబాద్) బాధ్యులు నదీమ్, యాసిన్ శుక్రవారం సీడీపీవో లక్ష్మీప్రసన్న ద్వారా అందజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ శారద, టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

## ఆటపాటలతో అలరించిన చిన్నారులు

పాల్వంచ, ఏప్రిల్ 4: కేటీపీఎస్ ఏ-కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్కూల్ డే జరిగింది. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు.

## జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 4: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాన్ని మండలంలోని లక్ష్మిదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డా.పద్మ నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సీఎంవోకు సన్మానం

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 4: సింగరేణి ప్రధాన ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంవో)గా నియమితులైన కిరణ్ రాజ్‌కుమార్‌ను మాదిగ సంక్షేమ సంఘం (అంబేద్కర్ భవన్) నాయకులు శుక్రవారం సన్మానించారు. సామర్ల సమ్మయ్య, బరిగెల భూపేష్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, కొత్తూరు మదనయ్య, ఇండిగపల్లి శంకర్ పాల్గొన్నారు.

## లీగల్ అడ్వైజర్‌గా సుధాకర్

ఇల్లెందు, ఏప్రిల్ 4: ఇల్లెందు, కోయగూడెం లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్‌గా మాజీ ఏజీపీ, న్యాయవాది కలవల సుధాకర్‌ను నియమితులయ్యారు. అసోసియేషన్ బాధ్యులు చిట్టిబాబు, నెలవెల్లి నరసింహారావు ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

## క్వార్టర్ కేటాయించాలని వినతి

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 4: బీసీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు క్వార్టర్ కేటాయించాలని కోరుతూ నాయకులు శుక్రవారం ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్యకు అధ్యక్షుడు పులి పూర్ణచందర్‌రావు ) జేకే 5 ఓసీ మేనేజర్) శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు నాగశేషు, పవన్‌కుమార్, గామాలపాటి మోహన్‌రావు, గుగ్గిల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 'వక్ఫ్ చట్టం దుర్మార్గం'

ములకలపల్లి, ఏప్రిల్ 4: వక్ఫ్ చట్టం దుర్మార్గమైనదని జేఐహెచ్ జాతీయ సభ్యుడు ఉస్మాన్ ఖాన్ విమర్శించారు. మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం సమావేశంలో మాట్లాడుతూ.. ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాడతామన్నారు. నాయకులు అబ్దుల్ జబ్బార్, బాజీబాబా, యాకూబ్, షబ్బీర్, జాఫర్, సహీ పాల్గొన్నారు.

## 'ఆశ్రమ పాఠశాల నిర్వహణ అధ్వాన్నం'

అశ్వారావుపేట, ఏప్రిల్ 4: మండలంలోని సున్నంబట్టి ఆశ్రమ పాఠశాలలోని పెదవాగు ప్రాజెక్ట్ ఆశ్రమ పాఠశాల నిర్వహణ అధ్వాన్నంగా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాంచరణ్, సాయి ఆరోపించారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ పాఠశాలను తాము శుక్రవారం సందర్శించినట్లు, సమస్యలను తెలుసుకున్నట్లు చెప్పారు. పాఠశాల అపరిశుభ్రంగా ఉందని, మెనూ పాటించడం లేదని చెప్పారు. వీటిపై ఐటీడీఏ పీవో దృష్టి సారించాలని కోరారు.

## బాలుడిపై పోక్సో కేసు

ఇల్లెందు, ఏప్రిల్ 4: ఓ బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. ఎస్సై నాగుల్ మీరా తెలిపిన వివరాలు.. స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న బాలికపై, అదే కళాశాలలోని బాలుడు శుక్రవారం లైంగిక దాడి చేశాడు. బాలిక తండ్రి ఫిర్యాదుతో ఆ బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దమ్మపేట, ఏప్రిల్ 4: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. దమ్మపేట గ్రామంలోని అర్బన్ కాలనీకి చెందిన గాజుబోయిన ప్రశాంత్‌కుమార్(19), దినసరి పని కోసం శుక్రవారం బైక్‌పై పట్వారిగూడెం వెళ్లి తిరిగొస్తున్నాడు. పట్వారిగూడెం శివారులో ఇతడి బైక్‌ను దమ్మపేట వైపు నుంచి వేగంగా వెళ్తున్న లారీ ఢీకొంది. ఆ యువకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆగకుండా వెళ్తున్న ఆ లారీని, ఎస్సై సాయికిషోర్‌రెడ్డి అడ్డగించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రశాంత్‌కుమార్ తల్లి గాజుబోయిన శాంతి ఫిర్యాదుతో కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

**కాల్వలో పడి కాంట్రాక్టర్..**

పాల్వంచ, ఏప్రిల్ 4: పాల్వంచలోని సంజీవనగర్‌కు చెందిన కాంట్రాక్టర్ కాంపెల్లి వెంకటేశ్వర్లు(50), గురువారం రాత్రి కాలువలో పడి మృతిచెందాడు. నవభారత్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. ఆ మత్తులో ఇంటికి నడుచుకుంటూ వెళ్తూ కాల్వలో పడ్డాడు. అప్పటికే వర్షం పడడం. వరద ఉధృతి ఉండడంతో కొంతదూరం కొట్టుకెళ్లాడు. స్నేహితులు వెతుకుతుండగా.. కాల్వ వెంట మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని పాల్వంచ సీహెచ్‌సీ మార్చురీకి తరలించారు. ఈయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

## రేకుల ఇల్లు దగ్ధం

ములకలపల్లి, ఏప్రిల్ 4: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబం తెలిపిన ప్రకారం.. మండలంలోని పూసుగూడెంలో చల్లా రామకృష్ణ-కుమారి దంపతులు దినసరి కూలీలు. వారు శుక్రవారం ఉదయం తమ రేకుల ఇంటికి తాళం వేసి కూలీ పనులకు వెళ్లారు. కొన్ని గంటల తర్వాత ఆ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారంతో ఆ దంపతులు పరుగు పరుగున తిరిగొచ్చారు. అప్పటికే ఇంట్లోని సామాన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది వచ్చేలోపే మంటలను స్థానికులు ఆర్పివేశారు. ఆ దంపతులు అప్పుగా తెచ్చిన రూ.లక్ష, మూడు తులాల బంగారం, మూడు తులాల వెండి, పొలం-ఇంటి పత్రాలు కాలిపోయాయి.

## రామయ్యకు రెండు ఇత్తడి గొడుగులు బహూకరణ


భక్తులు బహుకరించిన ఇత్తడి గొడుగులు

భద్రాచలం, ఏప్రిల్ 4: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి యూఎస్ఏకు చెందిన బుర్ర అరుణ్-రత్నబాల దంపతులు శుక్రవారం రూ.1.15లక్షల విలువైన రెండు ఇత్తడి గొడుగులను బహూకరించారు. వాటిని ఆలయ అధికారులకు అప్పగించారు. అనంతరం స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రామాలయంలో వైభవంగా ధ్వజారోహణం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 4: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామాలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం గరుడ ధ్వజాదివాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పర్ణశాల, ఏప్రిల్ 4: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పర్ణశాల దేవాలయంలో అర్చకులు ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్టాపనం, చతుఃస్తానార్చన, నిత్యా పూర్ణాహుతి కార్యక్రమాలను సాంప్రదాయానుసారంగా నిర్వహించారు.

## 7న జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 4: మ్యాథ్స్ అండ్ సైన్స్ సర్కిల్స్ కార్యక్రమాల్లో భాగంగా 8, 9 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర చారి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యాశాఖ శిక్షణ కేంద్రంలో 7వ తేదీన ఉదయం 10.00 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులను ఉపాధ్యాయులు తప్పనిసరిగా పంపించాలని, వివరాలను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్‌కు ఈ నెల 5వ తేదీ సాయంత్రం లోపు ఇవ్వాలని కోరారు.

## 'ప్రైవేట్ ట్యాక్సీలను నిషేధించాలి'

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 4: కొత్తగూడెంలోని ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తున్న ఉబర్, ఓలా, రాపిడో వంటి ప్రైవేట్ ట్యాక్సీ సంస్థలను తక్షణమే నిషేధించాలని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని ఆటో వర్కర్స్ యూనియన్ అన్ని అడ్డాల అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ట్యాక్సీల కారణంగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని, వారి కుటుంబాలు రోడ్డునపడే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ట్యాక్సీలను నిషేధించాలన్న డిమాండుతో ఈ నెల 8న కొత్తగూడెంలో ర్యాలీ ఉంటుందన్నారు. దీనిని ఆటో డ్రైవర్లంతా విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు బత్తుల సత్యనారాయణ, మర్రి కృష్ణ పాల్గొన్నారు.

## వర్షం బాధిత రైతులను ఆదుకోవాలి

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 4: అకాల వర్షంతో మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకుడు అబ్దుల్ నబి డిమాండ్ చేశారు. మండలంలోని పూబెల్లి గ్రామంలో తడిచిన మొక్కజొన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. 23 మంది రైతులకు చెందిన సుమారు 100 ఎకరాలకు పైబడి మొక్కజొన్న సాగు చేశారని అన్నారు. మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న పంటను అకాల వర్షంతో దెబ్బతీసిందన్నారు. బాధిత రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు ఆలేటి కిరణ్, తాళ్ళూరి కృష్ణ, వజ్జ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మందుపాతర పేలి గ్రామస్తుడి మృతి

### మరొకరికి తీవ్రగాయాలు.. ఛత్తీస్‌గఢ్‌లో ఘటన..

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 4: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి గ్రామస్తుడొకరు మృతిచెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ నారాయణ్‌పూర్ జిల్లాలో శుక్రవారం జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రాజేశ్ ఉసెండీ, రామ్‌లాల్ కొర్రమ్ చీపుర్ల తయారీకి పొరకని సేకరించేందుకు జడ్డా - మర్క్యూర్ మధ్య అటవీ ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే అక్కడ జవాన్లను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై రాజేశ్ కాలు వేశాడు. దీంతో అది భారీ విస్ఫోటనం చెందింది. ఈ ప్రమాదంలో రాజేశ్ రెండు కాళ్లు పూర్తిగా తెగిపోయాయి. తీవ్ర రక్తస్రావం జరగడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, రామ్‌లాల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు.. సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఓర్చ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం తీవ్రంగా గాలింపులు చేపడుతున్నాయి.

## పంట నష్టాన్ని చూసి.. స్పృహ కోల్పోయిన మహిళా రైతు

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 4: అకాల వర్షంతో దెబ్బతిన్న తన మొక్కజొన్న పంటను చూసిన మహిళా రైతు.. స్పృహ కోల్పోయింది. మండలంలోని పూబెల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు కల్తి కోటమ్మ.. గురువారం తన మొక్కజొన్న వద్దకు వెళ్లింది. దెబ్బతిన్న పంటను చూసి అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను పక్కనున్న వారు ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న ఆమెను శుక్రవారం సీపీఎం నాయకులు పరామర్శించారు.

## కృష్ణయ్య మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 4: మణుగూరు మండలంలోని తిర్లాపురం గ్రామంలో సొసైటీ మాజీ డైరెక్టర్ తోట కృష్ణయ్య మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, అక్కి నరసింహారావు, జావీద్‌పాషా, ఉప్పుతల రామారావు, తురక రాంకోటి, బోసెట్టి రవి, పెండ్యాల నాగేశ్వరరావు, తాటి పూర్ణచందర్‌రావు, యాకయ్య, మద్దిశెట్టి అనీల్ తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై నాగభిక్షం

బూర్గంపహాడ్, ఏప్రిల్ 4: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై నాగభిక్షం హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని సారపాక ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనదారుడి వాహనపత్రాలను పరిశీలించి పత్రాలు లేని వాహనదారులకు జరిమాన విధించారు. వాహన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, త్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు ఉంటాయన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.